మిరప రైతు కన్నీరు!

- భారీగా పతనమైన ధర
- క్వింటా రూ.2 వేల నుంచి రూ.750కు తగ్గిన వైనం
- గిట్టుబాటు గాక పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు

ఈ ఏడాది ఖరీఫ్ అన్నదాతలకు కలిసి రాలేదు. మిరప పంట దిగుబడి బాగున్నప్పటికీ గిట్టుబాటు ధర లభించకపోగా రోజురోజుకు పడిపోతుండటంతో పంట సాగుకు అయిన వ్యయం కూడా వచ్చేలా లేదని, అలాగే కోతలు, రవాణా చార్జీలు కూడా రావడం లేదని కొందరు రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంట నుంచి కనీస సొమ్ము రాకపోగా, శ్రమ, డబ్బు వృథా కావడంతో పాటు నిరర్థకంగా మారిందని రైతులు కన్నీరు పెడుతున్నారు.


హొళగుందలో మిరప పంటను పొలాల్లోనే వదిలేసిన దృశ్యం


పచ్చి మిరప


మొక్కలకు నిండుగా ఉన్న కాయలు

హొళగుంద: ఒకప్పుడు బోరు బావుల కింద మాత్రమే సాగయ్యే మిరప పంట ప్రస్తుతం వర్షాధారంగా విస్తారంగా సాగు చేయడం, ఈ ఏడాది విస్తారంగా వర్షాలు కురవడంతో దిగుబడి ఆశించిన దాని కన్నా అధికంగా వస్తుండటంతో అన్నదాతల మోములో సంతోషం వికసించింది. అయితే ఆ సంతోషం ఎంతో సేపు ఉండలేదు. ప్రారంభంలో పంట దిగుబడికి కొంత మంచి ధర లభించినప్పటికీ ప్రస్తుతం రోజు రోజుకు పడిపోతుండటంతో వారికి దిక్కుతోచడం లేదు. చివరకు కోత కోసేందుకు కూలీలు, మార్కెట్‌కు తరలించేందుకు అయిన రవాణా ఖర్చులు కూడా రాకపోతుండటంతో పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు.

550 హెక్టార్లలో పంట సాగు..

అతివృష్టికి తోడు అధిక విస్తీర్ణంలో పంట సాగవడంతో మిరప పంటకు గిట్టుబాటు ధర లభించక పెట్టుబడులు తిరిగి రాక అన్నదాతలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. దిగుబడులు బాగున్నా ధరలు రోజు రోజుకు తగ్గుతుండటంతో మిరప రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతేడాది క్వింటా రూ.2 వేలకు పైగా పలికిన ధర ప్రస్తుతం రూ. వెయ్యి లోపే పలుకుతోంది. అది కూడా నాణ్యత దున్న పంటకు మాత్రమే ఆ ధర లభిస్తోంది. మండలంలోని పెద్దహ్యాట, హొళగుంద, మార్లమడికి, హెబ్బటం, చిన్నహ్యాట, వందవాగిలి, గజ్జహళ్లి, సుళువాయి, నెరణికి, ఎల్లార్తి తదితర గ్రామాల్లో 90 శాతం రైతులు మిరప పంట సాగు చేశారు. గతంలో బోరు బావుల కింద సాగు చేసే రైతులు నేడు వర్షాధారంగా కూడా పంట వేస్తున్నారు. దీంతో పంట దిగుబడి పెరిగింది. మండలంలో దాదాపు 550 హెక్టార్లకు పైగా మిరప పంట సాగు చేశారు. ఎకరాకు పెట్టుబడి రూపంలో దాదాపు రూ.75 వేలు వెచ్చించారు.

ఆశాజనకంగా దిగుబడులు..
పతనమైన ధర..

ఎకరాకు సాధారణంగా 40 క్వింటాల వరకు దిగుబడి లభిస్తుంది. వర్షాలు ఆశాజనకంగా ఉండటంతో దిగుబడి బాగా వచ్చింది. అయితే ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో ధర లేకపోవడంతో మిరప రైతు కుమిలిపోతున్నాడు. గత కొన్నేళ్లుగా దిగుబడులు సరిగా రాలేదు. ఈ ఏడాది వచ్చినా కూలీలు, ఎరువుల ధరలు పెరగడంతో పెట్టుబడి వ్యయం పెరిగింది. ఇక రవాణా, కోతలు, కూలీలు తదితర ఖర్చుల కింద ఎకరాకు రైతు అదనంగా రూ.20 వేల నుంచి రూ.30వేల దాకా ఖర్చు చేయాల్సి వస్తుంది. దిగుబడులు బాగానే ఉన్నా ఆశించిన ధర లేకపోవడంతో రైతుకు గిట్టుబాటు కావడంలేదు. ప్రస్తుతం ఉన్న ధరలను బట్టి చూస్తే పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితి లేదు. దిగుబడిని వ్యాపారులకు అమ్మితే కిలో రూ. 7 నుంచి రూ.10 వరకు అడుగుతున్నారని, అదే మార్కెట్‌లో ప్రజలకు కిలో రూ.20కు పైగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని వాపోతున్నారు.

అప్పులే మిగిలాయి..



మిరప ధర రోజు రోజుకు తగ్గుతోంది. గతేడాది క్వింటా ధర రూ.2 వేలు ఉండగా ఈ ఏడాది మొదట్లో రూ.1,500 ఉండగా ప్రస్తుతం రూ.750కు పడిపోయింది. ప్రస్తుత ధరలు బట్టి చూస్తే గిట్టుబాటయ్యే పరిస్థితి లేదు. ఎకరాలో పంట సాగుకు రూ.75 వేల వరకు పెట్టుబడి పెట్టా. 30 మంది కూలీలతో ఒక రోజు కోత కోసి మార్కెట్‌లో అమ్మితే రూ.15 వేలు వచ్చింది. అయితే కోత, రవాణా ఖర్చు రూ.10 వేలు పైగానే వచ్చింది. ఇక ఎరువులు, మందులు, మొక్కలు, నెలల తరబడి తాము పడిన శ్రమ అంతా భరించాల్సిందే. ఇలా అయితే అప్పులు తప్పవు.

– సిద్దిక్ సాబ్, హొళగుంద, కౌలురైతు

మిరప రైతును ఆదుకోవాలి



ప్రభుత్వం మిరప రైతును ఆదుకోవాలి. ఎరువులు, ఇతర ఖర్చులు పెరగడం వల్ల రైతులు భారీగానే పెట్టుబడులు పెట్టుకోవాల్సి వస్తుంది. మొదట్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా కొద్దిగా దెబ్బతిన్నా ఆ తర్వాత కురిసిన వర్షాలకు పంట తేరుకుంది. తేరుకున్నారు. అయితే వర్షాలు అధికంగా కురవడంతో కొంత పంట దెబ్బతింది. ఈ సమయంలో మార్కెట్‌లో మిరప ధర అమాంతంగా పడిపోయింది. చాలా మంది రైతులు పదుల ఎకరాల్లో పంటలు సాగు చేసి నష్టపోయారు. ముఖ్యంగా కౌలు రైతులు భారీగా నష్టం చవి చూశారు.

– పెద్యాట మారెప్ప, సీపీఐ మండల కార్యదర్శి, హొళగుంద

క్లుప్తంగా

నేడు పత్తికొండకు కలెక్టర్ రాక

పత్తికొండ(తుగ్గలి): జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శుక్రవారం పత్తికొండకు రానున్నారు. పట్టణంలోని గోపాల్ ప్లాజాలో నిర్వహించే డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొంటారని ఆర్డీవో ఎస్.భరత్ నాయక్ గురువారం తెలిపారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం


గ్రామసభలో మాట్లాడతున్న ఏపీడీ పక్కీరప్ప

మద్దికెర : వ్యవసాయ పనులు ముగిసిన గ్రామాల్లో వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా అడిగిన వారందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పిస్తామని ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. గురువారం మండలంలోని ఎడవలి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూలీలు పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా, ఉన్న చోటనే పనులు కల్పిస్తామని, పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరా. ఏపీఓ నర్సిరెడ్డి ఉన్నారు.

పత్తికొండలో సీనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేయాలి

పత్తికొండ(తుగ్గలి) : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగస్వామి కోరారు. ఈ మేరకు వారు గురువారం న్యాయవాదులతో కలిసి అమరావతిలో న్యాయశాఖ కార్యదర్శి వి.సునీతకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో వెనుకబడిన పత్తికొండ పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు లేకపోవడంతో న్యాయవాదులు, కక్షిదారులు, ప్రజలు దాదాపు 40 కి.మీ. దూరంలో ఉన్న ఆదోనికి వెళ్లాల్సివస్తోందని ఇబ్బందులను వివరించారు. రెవెన్యూ డివిజన్ కూడా అవడంతో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు నాగేంద్ర, తిమ్మయ్యచౌదరి, న్యాయవాదులు బాలబాషా, సుధాకృష్ణ, రాజశేఖర నాయుడు ఉన్నారు.

ఇంటి వద్దే క్యాన్సర్ పరీక్షలు


క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర: 18 ఏళ్ల నిండిన యువతులతో పాటు ప్రతి మహిళకు ఇంటి వద్దే ముందస్తు ఎన్‌సీడీ సీడీ యాప్ ద్వారా 3.0 క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తామని, వైద్య సిబ్బందికి సహకరించాలని వైద్యులు రాగిణి, శ్రీలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని హంప గ్రామంలో క్యాన్సర్ పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యసిబ్బంది ప్రతి గ్రామంలో ఇంటింటికీ వచ్చి సర్వే చేస్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అమలు చేయాలి



వెల్దుర్తి ఉర్దూ స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఇందిర

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ ఇందిర ఆదేశించారు. వెల్దుర్తిలోని ఉర్దూ పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని చెప్పారు. మోనూ ప్రకారం భోజనం అందించాలని, భోజనం చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

వేతనాలు పెంచాలి

ఆలూరు: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో తాము ఎనిమిది ఏళ్ల నుంచి పనిచేస్తున్నామని వేతనాలు పెంచాలని ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు గురువారం విధులు బహిష్కరించారు. మల్లికార్జున, విజయ్‌కుమార్,సూర్యప్రకాష్ తదితరులు మాట్లాడుతూ 2022 పీఆర్‌సీ ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో గిరిజన గురుకులాల్లోని 1,143 మంది ఉపాధ్యాయ పోస్టులను మినహాయించాలని లేదా రెగ్యులైజేషన్ చేసేంత వరకు సమానపనికి సమానవేతం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ


క్రేన్ సాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

దేవనకొండ: మండలంలోని పాలకుర్తి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఇటీవల పునర్నిర్మించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ ప్రారంభోత్సవంతో పాటు ధ్వజస్తంభాన్ని గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా ప్రతిష్ఠించారు. అలాగే.. పెద్దమ్మ విగ్రహం, నాభిశిల, కలశ ప్రతిష్ఠ గావించారు. ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా లోగిళ్లు బంధుమిత్రులతో కళకళలాడాయి. ముఖ్యంగా ఆడపడుచులను ఇళ్ల కుఆహ్వానించి సంప్రదాయంలో భాగంగా ఒడిబి య్యం పోశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తు లు స్వామి వారికి, ధ్వజ స్తంభానికి పూజలు చేశారు. భక్తులు, బంధువులతో గ్రామం కిటకిటలాడింది.

పీహెచ్‌సీ ల్యాబ్ తనిఖీ


ల్యాబ్‌లోని రికార్డులను తనిఖీ చేస్తున్న సాయిబాబా

దేవనకొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ల్యాబ్‌ను గురువారం సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, ఎంపీహెచ్‌ఓ రంగస్వామి తనిఖీ చేశారు. జ్వరం వచ్చిన ప్రతిఒక్కరికీ సకాలంలో పరీక్షలు చేసి రిపోర్టు ఇవ్వాలని సూచించారు. మలేరియా లేదా డెంగీ జ్వరం ఉన్నట్లయితే చికిత్స వెంటనే ప్రారంభించాలని చెప్పారు. అలాగే గ్రామాల్లోని వైద్య సిబ్బంది కూడా జ్వరం వచ్చిన ప్రతిఒక్కరిని పరీక్షల కోసం సకాలంలో ల్యాబ్‌కు పంపాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదకరంగా ఎల్లెల్సీ ఫుట్ బ్రిడ్జి


హొళగుంద శివారులో ఎల్ఎల్‌సీ 183 కి.మీ పరిధిలో దెబ్బతిన్న ఫుట్ బ్రిడ్జి

హొళగుంద: మండల కేంద్రం సమీపంలో ఈబీసీ కాలనీ పక్కన తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) పై ఏర్పాటు చేసిన ఫుట్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. వంతెనపై పెద్ద పెద్ద రంధ్రాలు పడి, కోసుకుపోయి దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం అగ్రహారం ఆంజనేయస్వామి ఆలయానికి, ముద్దటమాగి గ్రామానికి, పొలాలకు వెళ్లే వారితో పాటు స్థానికుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఫుట్‌బ్రిడ్జి దెబ్బతినడంతో ప్రమాదాల బారిన పడి గాయాల పాలవుతున్నారు. వంతెనకు మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం


మట్టి వేసి చదును చేయిస్తున్న దృశ్యం

హాలహర్వి: మండలంలోని గూళ్యం మెయిన్ రోడ్డు నుంచి జె.హొసళ్లి గ్రామం వరకు, అలాగే కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన సింధువాళం వరకు దాదాపు 4 కి.మీ. వరకు మట్టి రోడ్డు వేయించామని సర్పంచ్ ఉలిగమ్మ గురువారం తెలిపారు. గ్రామానికి వెళ్లే రహదారి సరిగా లేకపోవడంతో గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెంటనే మట్టి వేయించి చదును చేయించామన్నారు.

రైతన్నా.. జాగ్రత్త!

- క్రిమి సంహారకాల వినియోగంలో అవగాహన అవసరం
- పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యంపై దుష్ప్రభావం


మిరప పైరుకు మందు పిచికారీ చేస్తున్న రైతు

మద్దికెర : ఆధునిక వ్యవసాయ విధానంలో దిగుబడులను పెంచుకునేందుకు రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం పెరిగిపోయింది. ఎరువులు వేసే సమయంలో, క్రిమి సంహారకాలు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. వాటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలు, సలహాలు తదితర అంశాలను వివరిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా మోనోక్రొటోఫాస్, ఆక్సిడిమోటాన్, మిథైల్, అసిఫేట్ తదితర విషపూరితమైన క్రిమిసంహారక మందులు పిచికారీ చేసే సమయంలో వాటి వినియోగ విధానంపై అవగాహన ఉండాలని సూచిస్తున్నారు.

- సస్యరక్షణ చర్యల కోసం వినియోగించే పరికరాలను పరిశుభ్రంగా ఉంచి నీటితో కడిగి, పొడిగుడ్డతో తుడిచి భద్ర పరచుకోవాలి.
- మందులు కలపడం, పిచికారీ చేసే సమయంలో వాటిపై అవగాహన ఉన్న రైతు సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టాలి.
- ఎక్కువ ఉష్ణోగ్రత, ఎక్కువ గాలి ఉన్న సమయంలో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయరాదు.
- స్ప్రే చేసే సమయంలో మద్యం, పొగతాగడం, పొగాకు నమలడం, గుట్కా, తంబాకు, ఇతర నిషేధిత పదార్థాలు సేవించకూడదు.
- కొన్ని రకాల నిషేధిత పురుగు మందులను వినియోగించకూడదు.
- వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలతో మందులను కొనుగోలు చేయాలి
- మితిమీరిన పురుగు మందులు, రసాయనాల వినియోగం వల్ల నేల, నీరు, గాలి, పర్యావరణం, పంటలు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం వుంది. పురుగు మందులు, రసాయనాలకు ప్రత్యామ్నాయాల ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు పద్ధతులపై రైతులు దృష్టి సారించాలి.

అప్రమత్తంగా ఉండాలి

పంటను చీడపీడల నుంచి రక్షించుకునేందుకు క్రిమి సంహారక మందులు వినియోగం తప్పని సరైందే. కానీ వాటిని వినియోగించే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి, లేదంటే వాటి ప్రభావం ఆరోగ్యంపై పడే ప్రమాదం ఉంది. నిర్లక్ష్యం వహిస్తే ఒక్కోసారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు.

– రవి, మండల వ్యవసాయాధికారి, మద్దికెర

దర్గాకు పోటెత్తిన భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

ప్రశాంతంగా షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు

- గ్రామ పంచాయతీకి ఏడాదికి రూ.14.55 లక్షల ఆదాయం
- వేలాల నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తు


బహిరంగ వేలాలు నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు


బందోబస్తును పర్యవేక్షిస్తున్న పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ వేలాలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. సర్పంచ్ అరుణాదేవి ఆధ్వర్యంలో పత్తికొండ డీఎల్‌పీఓ సమక్షంలో 27 షాపులకు వేలం నిర్వహించారు. డీఎల్‌పీఓ మాట్లాడారు. స్థానిక సంత మార్కెట్‌లో నేషనల్ రూర్బన్ మిషన్ కింద రూ.1.20 కోట్లతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను నాలుగేళ్లుగా అనివార్య కారణాతో వేలాలు వాయిదా పడ్డాయన్నారు. ఎట్టికేలకు గురువారం బహిరంగ వేలాలు నిర్వహించినట్లు చెప్పారు. వేలాల ద్వారా గ్రామ పంచాయతీకి ప్రతి నెలా రూ.1.20 లక్షలు, ఏడాదికి రూ.14.58 లక్షలు ఆదాయం సమకూరుతుందన్నారు. వేలం పాటలో షాపును దక్కించుకున్న వారు ఏడాది అద్దెను ముందుగా చెల్లించాలని సూచించారు. డిసెంబర్ నెలాఖరులోగా ఏడాది అద్దె చెల్లించి షాపులు తెరుచుకోవాలని చెప్పారు. అలాగే దుకాణాలను దక్కించుకున్న వారే నిర్వహించుకోవాలని, అలాకాకుండా ఇతరులకు బాడుగకు ఇస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఒకటవ నంబర్ దుకాణానికి అత్యధికంగా రూ.8 వేలు నెల అద్దెకు పోగా, షాపు నంబర్ 27 అత్యల్పంగా రూ.2,200 కు పాటదారులు దక్కించుకున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ ఈఓ ప్రభాకర్, సిబ్బంది వినోద్, వరుణ్, లక్ష్మన్న పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

కాంప్లెక్స్ వేలాలకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 2022లో మొదటి సారి నిర్వహించిన బహిరంగ వేలాల్లో టీడీపీ-వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో రెండు దఫాలు వేలాలు వాయిదాపడ్డాయి. దీంతో ఈ సారి ఎలాంటి గొడవలు లేకుండా జరిగేందుకు పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య పర్యవేక్షణలో ఆలూరు సీఐ వెంకటచలపతి, పత్తికొండ అర్బన్ సీఐ జయన్న, ఐదుగురు ఎస్ఐలు, 15 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

24న వాల్మీకుల వనభోజనం

ఆలూరు: మండల కేంద్రం సమీపంలోనున్న బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 24వ తేదీన ఆలూరు నియోజకవర్గం వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా ఉదయం 10గంటలకు వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో బైక్ ఉంటుందని, వేడుకలో కులస్తులు భాగస్వాములవ్వాలని కోరారు.

దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు


ఎల్లార్తిలోని షేక్షావలి దర్గాలో సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: మండలంలోని ఎల్లార్తిలో వెలసిన షెక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకొని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు దర్గాల్లో పూజలు చేపట్టారు. కొందరు భక్తులు రాత్రి దర్గా పరిసరాల్లో నిద్రించి మొక్కులు తీర్చుకున్నారు. సమాధులకు గలీఫాలను సమర్పించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో, షిర్డి సాయిబాబా ఆలయాలను దర్శించుకున్నారు.

వెల్దుర్తిలో చోరీ

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రమైన వెల్దుర్తిలోని నాల్గవ వార్డులోని నివాసముంటున్న మిద్దె రామాంజనేయులు ఇంట్లో గురువారం సాయంత్రం చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు మేరకు.. రామాంజనేయులు భార్య కళావతి సాయంత్రం ఇంటికి తాళం వేసి పిల్లలను తీసుకురావడానికి స్కూల్ దగ్గర వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సరికి తాళం పగలగొట్టి ఉండటం చూసి ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువాను పగలకొట్టి అందులోని రూ. 50వేల నగదు, 25 తులాల వెండి ఆభరణాలను చోరీ అయ్యాయని గుర్తించారు. విషయాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అశోక్ మాట్లాడుతూ చోరీ జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, విచారించి కేసు నమోదు చేశామని చెప్పారు.

చలో కలెక్టరేట్‌కు తరలిరండి

వెల్దుర్తి(కృష్ణగిరి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభు త్వం తన ఆర్థిక విధానాలను మార్చుకోకుండా గత విధానాలనే అమలు చేయడాన్ని ఖండిస్తూ ఈ నెల 26వ తేదీన నిర్వహించే చలో కలెక్టరేట్‌కు ప్రజలందరూ తరలిరావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక మోటార్ వర్కర్స్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా, ప్రకృతి సంపదనే దోచి పెట్టేలా పాలన సాగిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా దీన్ని ఖండించకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వాలను మేల్కొల్పేలా పోరాటాలకు సిద్ధం కావాలని కోరా రు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రాముడు, శ్రీనివాసులు, బజారి, చిన్నఏసు, వెంకటరాముడు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి శ్రీరాములు గుండెపోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు గురువారం నిత్యావసర సరుకులు, నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్ద అకాల మరణంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండటాన్ని గుర్తించి తనతోపాటు కొందరు పాత్రికేయులు తమ వంతుసాయం చేసినట్లు తెలిపారు. మృతునికి నలుగురు కుమార్తెలుండగా.. వారి చదువులు మధ్యలో ఆగిపోకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఖాదర్‌బాషా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

హాలహర్వి: గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందజేశారని లైబ్రేరియన్ రవీంద్రనాథ్ తెలిపారు. హెచ్ఎం ఉశేనప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీ సర్వే పకడ్బందీగా చేపట్టాలి


భూముల సర్వే వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎమ్మిగనూరురూరల్: భూముల రీ సర్వేను తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో జరిగే రీ సర్వేను ఆయన పరిశీలించారు. అలాగే గ్రామంలో రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు భూ సమస్యలు లేకుండా రీ సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటు చేయించాలన్నారు. సర్వేలో ఏమైన సమస్యలుంటే వాటికి వెంటనే పరిష్కారం చూపించాలని తెలిపారు. సర్వేయర్లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రైతులకు న్యాయం చేయాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌లలో సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీజన్ వ్యాధులు సోకకుండా చూడాలని, అవసరమైతే హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఆర్‌బీకె రైతులకు ఉపయోగకరంగా ఉండాలని, అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ జోతిర్మయి, డిప్యూటీ సర్వేయర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కోసిగి: మండల కేంద్రంలోని సిద్దప్పపాళెం కాలనీలో బి.రామకృష్ణ అనే వ్యక్తి గ్రామ చావిడి వద్ద అక్రమంగా కర్ణాటక మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ బి.కార్తీక్ సాగర్ తెలిపారు. గురువారం రాబడిన సమాచారం మేరకు కోసిగి పరిసర ప్రాంతాలలో ముమ్మరంగా తనిఖీలు చేశామన్నారు. తనిఖీల్లో భాగంగా రామకృష్ణ నుంచి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 93 ఒరిజనల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కోసిగి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేపట్టినా, తరలించినా 94409 02580 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ కె.నాగరాజు, డి.కిశోర్‌కుమార్, కానిస్టేబుళ్లు మునిరంగడు, భరత్, రవికుమార్, జనార్దన్‌రావు ఉన్నారు.